www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం జూన్ 28 2024
5
చిత్తూరు



'పంప్ బాయ్స్ కావలెను'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు పట్టణంలో దర్గా కూడలి వద్ద నిర్మాణంలో ఉన్న పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్‌ను త్వరలో ప్రారంభించనున్నారు. చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు పెట్రోల్ బంక్‌లో పంప్ బాయ్స్‌గా పని చేయుటకు 10వ తరగతి పాస్ అయిన 21 నుండి 40 సంవత్సరాల వయస్సు గల వారు కావలెను అని, రూ.12వేలు జీతం ఇవ్వనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు 10వ తరగతి మార్క్ లిస్ట్‌తో పాటు ఆధార్ కార్డ్ తీసుకొని ఈనెల 30వ తేదీ లోపు 1వ పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న చిత్తూరుఆర్మ్డ్ రిజర్వ్ ఆఫీస్‌లో సంప్రదించగలరని ఆర్ఐ భాస్కర్ తెలిపారు. ఇతర సమాచారం కొరకు 9491074516ను సంప్రదించాలని కోరారు.

అక్రమ మైనింగ్ కట్టడికి చర్యలు: కలెక్టర్

7లోపు మౌలిక వసతుల కల్పనపై నివేదిక సిద్ధం చేయాలి

ప్రజాశక్తి- గుడుపల్లి : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు వసతి గృహాలలో మౌలిక వసతుల కల్పనపై పూర్తి నివేదికను జూలై 7వ తేదీ లోపు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం కుప్పం ఆర్అండ్‌బి అతిథి గృహంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, సమగ్రశిక్ష జిల్లా అధికారులు, కుప్పం నియోజకవర్గ ఎంఈఓలతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాలు, మోడల్ పాఠశాలలు, కేజీబీవీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వసతి గృహాలలో మౌలిక సదుపాయాల కల్పనపై జూలై ఏడో తేదీలోపు పూర్తి నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నివేదికను సిద్ధం చేయడంలో పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి ఇరిగేషన్‌శాఖల ఇంజనీరింగ్ అధికారులు సమన్వయం చేసుకొని పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలన్నారు. మౌలిక వసతుల కల్పనతోపాటు ప్రతి పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల వివరాలను కూడా సేకరించాలన్నారు.

అక్రమ మైనింగ్ కట్టడికి చర్యలు: కలెక్టర్

జిల్లాలో అనుమతులు పొంది ఉన్న మైనింగ్ వివరాలతో పాటు అక్రమ మైనింగ్ చేస్తున్న వారి పూర్తి వివరాలను మండలాల వారీగా బృందాలను ఏర్పాటు చేసి నివేదికను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డిడి మైన్స్ ఎల్‌వి ప్రసాద్‌ను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మైనర్ మినరల్స్‌లో భాగంగా 665 లీజులకు అనుమతి ఇవ్వడం జరిగిందని డిడి మైన్స్ కలెక్టర్‌కి వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో డిఆర్‌ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడిఎన్.రాజశేఖర్, సమగ్రశిక్ష ఏపిసి వెంకట రమణారెడ్డి, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ డిడిలు రాజ్యలక్ష్మి, రబ్బానీ బాష, సంబంధిత అధికారులు, కుప్పం నియోజక వర్గ ఎంఈఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

పట్టపగలే తోడేస్తున్నారు..

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- రాత్రి వేళల్లో ట్రిప్పర్లతో కర్ణాటకకు తరలింపు
- పట్టా భూములను సైతం వదలని అక్రమార్కులు
- నిద్రావస్థలో రెవెన్యూ, పోలీసు అధికారులు



ప్రజాశక్తి- గంగవరం

మండలంలోని గుంటిగల్లు, బొమ్మనపల్లి పరిధిలోని దొరచెరువు, కౌండిన్యనదిలో ఇసుకను అక్రమార్కులు పట్టపగలే యథేచ్ఛగా తరలిస్తున్నా ఎవరు పట్టించుకున్న పాపానపోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగటిపూట ట్రాక్టర్ల ద్వారా ఎక్కువ మంది కూలీలతో నిమిషాల్లో ఇసుక లోడ్ చేయించి పక్కరాష్ట్రమైన కర్ణాటకకు తరలిస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్నారని తెలిపారు. అదే ఓ రైతు, సామాన్యుడు ఇళ్లు కట్టుకోవాలంటే ట్రాక్టర్ ఇసుక రూ.5 నుంచి 6వేలు ధర చెబుతున్నారని ఇసుక ఇంత దోపిడీ జరుగుతున్నా అధికారులు మాత్రం నిద్రావస్థలో ఉన్నారని విమర్శిస్తున్నారు. నదిలోని ఆయకట్ట పరిసర ప్రాంతాలతోపాటు పక్కనే ఉన్న పట్టా భూముల్లోని ఇసుకను సైతం తోడేస్తున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇంకొంత మంది అక్రమార్కులు ఏకంగా ఇసుకను వారి సొంత భూముల్లోకి తరలించి రాత్రివేళల్లో ట్రిప్పర్ల ద్వారా కర్ణాటకకు తరలిస్తున్నారని చెబుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారికి అడ్డుఅదుపు లేకుండాపోయిందని, భవిష్యత్తులో చుట్టుపక్కలగ్రామాల్లో ఇళ్లు కట్టుకోవాలన్నా ఇబ్బందులు తప్పవని అంటున్నారు. అంతేకాకుండా భూగర్భజలాలు సైతం అడుగంటిపోతున్నాయని, వ్యవసాయానికి, తాగునీటికి అవస్థలు పడాల్సి వస్తోందని అంటున్నారు. ఇదే గ్రామంలో గంగవరం మండల అధ్యక్షులు ఉన్నా అధికారులు నాయకులు ఎవరూ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని అంటున్నారు. గ్రామాల్లో పగలే ఇంతలా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా రెవెన్యూ అధికారులకు,



పోలీసులకు కనపడలేదా అంటున్నారు. గ్రామంలో విఆర్ఓ, సెక్రటరీ సచివాలయ సిబ్బంది కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమాలను అరికట్టి కట్టడి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టిడిపిలోకి మున్సిపల్ చైర్మన్, పాలకవర్గం

- పెద్దిరెడ్డి ఇలాకాలో అంతు పట్టని వైనం - ఇది కల నిజామా అంటున్న జనం

ప్రజాశక్తి -పుంగనూరు

పుంగనూరు మున్సిపాలిటీలో వైసిపికి చెందిన చైర్మన్, కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. మున్సిపల్ చైర్మన్ అలీంబాషా,12 మంది కౌన్సిలర్లు టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్ల బాబు ఇంటీకి వెళ్లి గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన చైర్మన్ కౌన్సిలర్లు మీడియాతో మాట్లాడుతూ పుంగనూరు మున్సిపల్ కేంద్రంలో గత 15 సంవత్సరాలుగా వైసీపీ పార్టీయే ఉందని, అందరికీ పదవులు అయితే ఇచ్చారు కానీ పవర్ లేకుండా చేశారని చెప్పారు. యువత అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ అడుగులు వేస్తున్నాయని చంద్రబాబు పరిపాలన అభివృద్ధికి బాట వేస్తున్నారని తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామని ప్రకటించారు. వైసిపి పాలకవర్గం తెలుగుదేశం పార్టీలో చేరడంతో పట్టణంలో పెద్దచర్చ వాతావరణం ఏర్పడింది. ఇది కళా నిజమని నమ్మలేకపోతున్నామని మరి కొందరు అంటున్నారు. మాపైన ఎలాంటి కేసులు కానీ, రౌడీ షీట్లుగాని లేవన్నారు. కేసులు పెడతారేమోనని భయపడే అయితే పార్టీలో చేరడం లేదని చెప్పారు. ఏది ఏమైనా వైసీపీ చైర్మన్ పాలకవర్గం కలిసి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు ప్రకటించడం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వారిలో ఉన్న అసంతృప్తిని తెలపడం జరిగింది. అయితే మిగిలిన తెలుగుదేశం పార్టీ వర్గం మాత్రం వీరిని టిడిపిలో చేర్చుకోవడంతో అసంతృప్తి సెగలు వెలగక్కుతున్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

ఆటపాటల.. ప్రభుత్వ బడి

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జివి.రమణ

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: ఆటపాటల బడి ప్రభుత్వ బడి అని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జివి.రమణ అన్నారు. గురువారం బంగారుపాలెం మండలం మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ బడులను రక్షించుకుందాం కరపత్రాలను మండల యుటిఎఫ్ అధ్యక్షులు మొగిలయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి అంటే ఉపాధ్యాయుడు విద్యార్థులే కాదని పరిసరాల్లోని సమాజం కూడా ప్రభుత్వబడిలో ఒక పాత్రని, చదువుసంస్కారం, నైతిక విలువలు, దేశభక్తి, సమానత్వ భావనాలను ప్రభుత్వ బడిలోనే అలవాటు చేస్తారని అన్నారు. గ్రామీణ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఉపాధ్యాయునిపై ఉన్నదని బడి వయసు పిల్లలు బడిలోనే ఉండే విధంగా చూడాలని, ప్రభుత్వం అందించే ఉచిత విద్యపై గ్రామీణులకు అవగాహన కల్పించాలన్నారు. వేషధారణలతో ప్రైవేట్ పాఠశాలలో బురిడీ కొట్టిస్తున్నాయని, ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య అందించేందుకు అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నారని, గ్రామీణ ప్రాంత ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ బడులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత, జిల్లా కార్యవర్గ సభ్యులు ధనంజయరాజు, మండల కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు బాలాజీ, జగదీశ్వర్, రవి పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రకృతి వ్యవసాయంలో..

ఇతర రాష్ట్రాలకు ఆదర్శం 'కుప్పం'

రైతులకు టార్పాలిన్, డ్రమ్‌ల పంపిణీ

ప్రజాశక్తి- గుడుపల్లి

మన రాష్ట్రంలో అధికశాతం రైతులు జీరో బడ్జెట్ న్యాచురల్ ఫార్మింగ్ (ప్రకృతి వ్యవసాయం) చేస్తున్నారని ఈ విధానం ఇతరరాష్ట్రాలకు ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. గురువారం కుప్పం ఎంపిడిఓ కార్యాలయంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సంఘం ఆధ్వర్యంలో పిఎంఎజెఏవై పథకం కింద ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్‌సి రైతులకు వంద శాతం రాయితీపై 18×24 అడుగుల టార్పాలిన్లు, ప్లాస్టిక్ డ్రమ్‌ల పంపిణీ కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, ముఖ్యఅతిధులుగా జెసి పి.శ్రీనివాసులు, సంబంధిత అధికారులు, మహిళా రైతులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పిఎంఎజెఏవై కింద జిల్లాలో 1,205 మంది రైతులు లబ్ధిదారులుగా ఎంపిక కాగా కుప్పం నియోజకవర్గంలో 518 మంది రైతులు ఎంపికయ్యారని, ఇందులో రూ.5వేలు విలువైన 2 టార్పాలిన్‌లు, రూ.1,830 విలువైన 200 లీటర్ల డ్రమ్ ఒకటి, రూ.1,020 విలువైన డ్రమ్ ఒకటి కలెక్టర్, ఎంఎల్‌సి, జెసి చేతుల మీదుగా మహిళా రైతులకు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కుప్పంలో చాలా గ్రామాలలో యంత్రాలు, రసాయనాలు లేని ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. వీరు ఆవు పేడ, గోమూత్రం, ఇతర ప్రకృతి సంబంధమైన ఎరువులను తయారు చేసుకుని సేంద్రియ విధానంలో పంటలు పండిస్తున్నారన్నారు. ఈపంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్యం, జీవన విధానం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్నప్పుడు వచ్చే చిన్నపాటి సమస్యలను అవగాహన ద్వారా అధిగమించి కొనసాగించాలని, తోటి రైతులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ తరహా విధానం ద్వారా రైతులకు ఆదాయం పెరుగుతుందని సేంద్రీయ వ్యవసాయానికి అవసరమైన సహాయం జిల్లా యంత్రాంగం అందిస్తుందన్నారు. ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పంలో పేదరికాన్ని రూపుమాపడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యంగా చేసుకున్నారన్నారు. కుప్పం అభివృద్ధికి గతంలో చేసిన హామీల అమలుకు సంబంధించి కొన్నింటికి ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు రావడానికి ముందే ఉత్తర్వులు జారీ చేశారన్నారు. మరికొన్నింటి అమలుకు కార్యాచరణ ప్రణాళికను, అంచనా వ్యయాలను సిద్ధం చేయవలసిందిగా జిల్లా కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా మహిళా రైతులు విజయలక్ష్మి, నాగ భూషణమ్మ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంట సాగు చేయడం వల్ల కలిగే లాభాలను, దిగుబడి వివరాలను వివరించారు. డిపిఎం వాసు, ఎస్‌సి కార్పొరేషన్ ఇన్చార్జి ఈడి రాజ్యలక్ష్మి, నాయకులు, ఎంపిపి డాక్టర్ సురేష్ బాబు, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



టార్పాలిన్, డ్రమ్‌లను పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

ఎమ్మెల్యే మురళీమోహన్



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి- పూతలపట్టు: వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రోగులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వైద్యులతో సమావేశమై మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని కోరారు. అలాగే గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. మండల మాజీ కన్వీనర్ చంద్రమౌళి ఉన్నారు.

'28, 29వ తేదీల్లో వివరాలను అందచేయాలి'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సాధారణ ఎన్నికలు 2024కు సంబంధించి ఎన్నికల కోడ్ రోజు నుండి ఎన్నికల ముందు వరకు కంటెస్టింగ్ కాండిడేట్స్ వారు పెట్టిన మొత్తంను ఖర్చు రిపోర్టు పొందుపరచాలని పార్లమెంటు నియోజకవర్గానికి గాను డిప్యూటీ రిటర్నింగ్ ఆఫీసర్, శాసనసభ నియోజకవర్గాలు పుంగనూరు, నగరి, గంగాధర నెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం రిటర్నింగ్ ఆఫీసర్లకు, ఎఆర్‌ఓలకు జిల్లా కలెక్టర్ ద్వారా ఇది వరకే మెయిల్ నోటీసులు పంపామని జిల్లా ఆడిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈనెల 28, 29వ తేదీలలో అబ్జర్వర్లు వస్తారని వారికి ఫైనల్ ఎక్స్పెండేచర్ వివరాలను చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గం, శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన క్యాండిడేట్ల సంతకంతో వారికి ఇవ్వాలని తెలిపారు. ఇప్పటివరకు చేసిన రిపోర్టులలో ఏదైనా సందేహం ఉంటే వాటిని తెలుసుకొని రిపోర్టులు రెడీ చేసుకోని అబ్జర్వర్లకు అందజేయాలని తెలిపారు.

పెన్షన్ల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ

1న ఇంటి వద్దే పింఛన్లు : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పథకం ద్వారా పెన్షన్ల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జూలై 1న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ సంబంధించి డిఆర్‌డిఏ, మెప్మా పిడిలు, ఎల్‌డిఎం జడ్పీ సీఈఓ, ఐసిడిఎస్, ఆర్డీఓలు, ఎంపీడీఓ లు తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పథకం అమల్లో భాగంగా నూతన ప్రభుత్వం పెంచిన సామాజిక భద్రతా ఫించన్లను జూలై 1 ఫించనుదారుల ఇంటి వద్దే పంపిణీకి పటిష్టమైన ఏర్పాట్లను చేయాలనన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒకటవ కేటగిరీలోని వృద్ధులు, వితంతువులు తదితర 11 ఉప కేటగిరీలకు చెందిన వారి ఫించను సొమ్మును రూ.3 నుండి రూ.4 వేలకు పెంచిన నేపథ్యంలో జూలై 1 వ తేదీన రూ.4 వేలతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి పెరిగి ఫించను సొమ్ము నెలకు రూ.1,000ల చొప్పు మూడు మాసాల ఎరియర్స్ కలుపుకుని మొత్తం రూ.7,000లను పంపిణీ చేయాలని ఆదేశించారు. రెండో కేటగిరీలోని పాక్షిక దివ్యాంగులకు రూ.3 నుండి రూ.6 వేలకు, మూడో కేటగిరీలోని పూర్తిస్థాయి దివ్యాంగులకు రూ.5 నుండి రూ.15 వేలకు, నాల్గో కేటగిరీలోని కిడ్నీ, తలసేమియా వంటి దీరకాలిక వ్యాధులతో బాధపడేవారికి రూ.5 నుండి 10 వేలకు ఫించను సొమ్ము పెంచిన విధంగా పంపిణీ చేయాలని సూచించారు. మిగిలిన ఐదో కేటగిరీలోని వారికి గతంలోలాగా ఎటు వంటి మార్పు లేకుండా యథావిధిగా ఫించను సొమ్మును పంపిణీ చేయాల్సి ఉందన్నారు. జూలై 1న ఉదయం 6 గంటల నుండి ఫించనుదార్ల ఇంటి వద్దే ఫించను సొమ్మును పంపిణీ చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పాటు అవసరం మేరకు ఇతర శాఖ ఉద్యోగుల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఒక్కొక్క ఉద్యోగికి 50 గృహాలు చొప్పున ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని అప్పగించే విధంగా క్లస్టర్ల వారీగా మ్యాపింగ్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. సాధ్యమైనంత మేర ఒకేరోజు ఈ ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, అనివార్య కారణాల వల్ల ఇంకా ఎవరన్నా మిగిలిపోయి ఉంటే రెండోరోజు కూడా ఈ పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. కలెక్టరేట్ నుంచి డిఆర్‌డిఏ, మెప్మా పీడీలు తులసి, రాధమ్మ, జడ్పీ సీఈఓ గ్లోరియా, ఎల్‌డిఎం హరీష్, అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై శ్రద్ధ అవసరం

ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుంది.. పిల్లలు ఆరోగ్యమే మహాభాగ్యం అని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్ - 2024' కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు చేతులు శుభ్రపరచడంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం గిరింపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, కమిషనర్ డాక్టర్ జె.అరుణ, డిప్యూటీ డీఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో డయేరియా, మలేరియా వంటి వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా కాచి చల్లార్చిన నీరు తాగడం, శుభ్రమైన తాజా ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. విద్యార్థులంతా వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని, ఇంటి వద్ద శుభ్రత పాటించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ముందస్తు నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. విద్యార్థులతో కలిసి చేతుల శుభ్రపరిచే ఆరు ప్రక్రియలను ఎమ్మెల్యే, కమిషనర్, ఇతర అధికారులు చేశారు. విద్యార్థులతో పాటు భోజనం చేశారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, ఎంఈవోలు సెల్వరాజ్, మోహన్, హెచ్ఎం రమేష్ బాబు పాల్గొన్నారు.



పరిశుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

'కేన్సర్ కేర్' పై శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

'కాంప్రహెన్సీవ్ కేన్సర్ కేర్'పై వైద్యసిబ్బందికి అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం నాలుగో బ్యాచ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఒ ప్రభావతి దేవి లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా డిఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలోని వైద్యాధికారులకు, ఎంఎల్ హెచ్‌పిలకు, ఏఎన్ఎంలకు 30 సంవత్సరాల పైబడిన వారికి వివిధ రకాల కేన్సర్, సర్వైకల్ కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్, ఓరల్ కేన్సర్‌పై స్క్రీనింగ్ ఎలా చేయాలఅనేదానిపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ అన్ని జిల్లా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు, ఏరియా హాస్పిటల్స్‌లో కూడా జరుగుతుందని తెలిపారు. ఒక్కో బ్యాచ్‌కి 40మంది చొప్పున శుక్రవారం రెంయి జూలై 10వ తారీకు వరకు ఈ కార్యక్రమం పూర్తిచేసి, ఇంటింటి స్క్రీనింగ్ సర్వే చేసి మెడికల్ కాలేజ్‌లో ట్రీట్మెంట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో అందరూ అన్ని విషయాలను తెలుసుకుని స్క్రీనింగ్ కార్యక్రమాన్ని పక్కాగా చేయాలని తెలిపారు. ఎన్‌సిడి కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష, డిపిఓ డాక్టర్ హర్షవర్ధన్, ఎపిడీ మియాలజిస్ట్ శ్రీవాణి, టిఓటిలు డాక్టర్ దేవరాజ్ డెంటిస్ట్, డాక్టర్ కె.శిరీష, డాక్టర్ మాధవి స్త్రీల వైద్య నిపుణులు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు తీర్చండి..

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని సోడిగానిపల్లి గ్రామపంచాయతీ సోడియనిపల్లి గ్రామంలో రెండు రోజు నుంచి తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం గ్రామపంచాయతీ సచివాలయం ఎదుట గ్రామస్తులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో 150 కుటుంబాలున్నాయని, తాగునీటి బోరు రిపేరు కావడంతో తాగునీరు, పశువులకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సమస్యను గురించి అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సచివాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

నేడు వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం

చొక్కమడుగు గ్రామంలో 28 శుక్రవారం ఉదయం ఎన్టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ వివిఎస్ థామస్ ప్రారంభిస్తారని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ థామస్ జన్మదిన పురస్కరించుకొని భారీ కేక్ కట్ చేస్తారని, ఎమ్మెల్యే అయిన తర్వాత మొట్టమొదటిసారిగా చొక్కామడుగు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం దాదాపు రూ.7లక్షల వ్యయంతో ప్లాంటు నిర్మించారన్నారు. ప్లాంట్ నిర్మాణ కార్యక్రమాన్ని ఎస్సీ సెల్ నియోజకవర్గ కార్యదర్శి కుమార్ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

విద్యాసామగ్రి వితరణ



ప్రజాశక్తి- కార్వేటినగరం: శ్రీసరస్వతి మాతా సేవ సమాజం స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి ఎం.విజయకుమార్ అన్నారు. గురువారం మండలపరిధిలోని పాదిరికుప్పం ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు శ్రీసరస్వతి మాతా సేవా సమాజం స్వచ్ఛంద సంస్థ రూ.17500 విలువ జేసే విద్యాసామగ్రిని వితరణ చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎంఈఓ విజయకుమార్ పాల్గొని మాట్లాడారు. శ్రీసరస్వతి మాతా సేవా సమాజం సంస్థ నేడు 300లకు పైగా సభ్యులతో దాతృత్వానికి మారుపేరుగా దూసుకుపోతాందని, పరిసరాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు వారికి కావాల్సిన విద్యాసామగ్రిని అందించి తమ దాతృత్వాన్ని చాటుకుంటోందని అన్నారు. అనంతరం విద్యార్థులకు ఎంఈవో విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం సుప్రసన్న, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లీలాకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం



ప్రజాశక్తి- చిత్తూరుడెస్క్: నగరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, చింతలపట్టెడ దళితవాడకు చెందిన ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమని ఎంఈవో శ్రీదేవి అన్నారు. గురువారం పాఠశాలను సందర్శించిన ఆమె పాఠశాల ప్రహరీ గోడలను ఉపాధ్యాయులు పిల్లల విజ్ఞానం పెంచే విధంగా మార్చి ఉండడాన్ని గమనించారు. సైన్స్ చిత్రాలు, ఆంగ్ల పదాలు, రాష్ట్రాల రాజధానులు, ఆరోగ్యపరమైన అంశాలు మొదలగు వాటిని అద్భుతంగా చిత్రీకరించారని ఉపాధ్యాయులను ప్రశంసించారు. గ్రామస్తుల సహాయసహకారాలు, ఆర్థిక సహకారాలతో దీనిని రూపొందించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థుల ఉన్నతికి గ్రామస్థుల కృషి అభినందనీయమని కొనియాడారు.

'సమాజ అభివృద్ధికి ఉపాధ్యాయుల కీలకం'

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: సమాజ అభివృద్ధికి ఉపాధ్యాయుల కీలకమని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. గురువారం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు పరమానంద పదవీ విరమణ కార్యక్రమం ప్రధానోపాధ్యాయ ధనంజయరాజ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ సమాజస్థాపనకు ఉపాధ్యాయుల కీలకమని విద్యాబుద్ధులు ప్రాథమిక దశనుండే నేర్పిన ఉపాధ్యాయులను ఎదిగిన తర్వాత ప్రతి ఒక్కరు గుర్తించుకుంటారని అన్నారు. ఏ వృత్తిలో అయినా ఎదిగేందుకు ఉపాధ్యాయుల నేర్పిన విద్యాబుద్ధులే గొప్పని అన్నారు. అనంతరం ఆయన్ను శాలువతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర , విశ్రాంతి ఎంఈఓ చంద్రన్, ఉపాధ్యాయులు రమణ, సరిత, ధనంజయరాజు, మొగిలయ్య, మోహన్ రెడ్డి, నవీన్, రామకృష్ణరాజు పాల్గొన్నారు.

షర్మిలను కలిసిన ఎంఎస్ బాబు



ప్రజాశక్తి- తవణంపల్లి: హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లో నివాసముంటున్న పిసిసి రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి నిర్మాణాత్మకమైన చర్చలు జరిపారు. త్వరలోనే ఏర్పాటు చేయనున్న చిత్తూరు జిల్లా నూతన కమిటీ నియామకంపై మంతనాలు చేశారు. రానున్నది కాంగ్రెస్ పార్టీ అని, కష్టపడి పనిచేసే వారికి కాంగ్రెస్ పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందని షర్మిల పేర్కొన్నారు. తవణంపల్లి ఎంపీపీ పుణ్య సముద్రం రవి, బిసి నాయకులు లక్ష్మీ ప్రసన్న, యాదమరి మండలం సీనియర్ నాయకులు వెంకటేష్ ఆయన వెంట ఉన్నారు.

సీజనల్ వ్యాధులు, డయేరియాపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అయూష్ మెడికల్ అధికారులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు ప్రభుత్వ ఆయుష్ మెడికల్ అధికారులు, సిబ్బంది గురువారం తపోవనం పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, డయేరియా గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులందరికీ ఆయుర్వేద, హోమియో, యునాని మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో హోమియో వైద్యాధికారిని డాక్టర్ శ్రీవాణి, ఆయుర్వేద వైద్యాధికారిణి డాక్టర్ వి.హరిత, యునాని వైద్యాధికారి డాక్టర్ జగదీష్, ఆయుష్ వైద్యసిబ్బంది మురళి, విమల, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పుంగనూరు డివిజన్ మలేరియా యూనిట్ అధికారి గంగయ్య అన్నారు. కోగిలేరు పంచాయతీ బసవరాజు కండ్రిగ గ్రామంలోని భావన(12) బాలికకు రెండు రోజుల క్రితం తిరుపతిలో డెంగీ నిర్ధారణ కావడంతో విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది గురువారం బసవరాజుకండ్రిగలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నీటితొట్టెలు, మురుగునీటి గుంతలు, మురుగునీటి కాలువల్లో అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. అలాగే మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను శుభ్రం చేసుకోవాలని అలాగే వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. సర్పంచ్ రమేష్ బాబు, రాయలపేట ఆరోగ్య కేంద్రం ఎంపీ హెచ్ఈఓ శ్రీనివాసులు, సూపర్వైజర్ గీతాంజలి, ఏఎన్ఎం సుజాత, ఆశా వర్కర్ లలిత పాల్గొన్నారు.

నూతన ఎస్సైగా డి.శ్రీనివాసులు

ప్రజాశక్తి- గుడుపల్లి



మండలం ఎస్సైగా డి.శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఉన్న ఎస్ఐ లక్ష్మీకాంత్‌ను శుక్రవారం చిత్తూరు విఆర్‌కు బదిలీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను ప్రతిష్టంగా అమలు చేస్తానన్నారు.

పారిశుద్ధ్య పనులు



ప్రజాశక్తి- సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కందూరు గ్రామానికి సంబంధించి బాలప్పగారిపల్లె గ్రామంలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పంచాయతీ పరిధిలోని గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టి మురుగునీటి కాలువలు శుభ్రంచేసి పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతోందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. తాగునీటి పైపు లైన్లను కూడా లీకేజీలు ఉంటే మరమ్మతులు చేసి బాగు చేయనున్నట్లు తెలిపారు.

వారపు సంత గేటు ద్వారా

రూ.10.40 లక్షల ఆదాయం

ప్రజాశక్తి- పూతలపట్టు: మండల కేంద్రంలోని వారపు సంత గేటు ద్వారా పంచాయతీకి రూ.10.40 లక్షలు ఆదాయం వచ్చింది. గురువారం సచివాలయంలో నిర్వహించిన వేలంపాటలో కాజా సంత గేటును తొమ్మిది నెలలకు సొంతం చేసుకున్నారు. అదేవిధంగా 11 పంచాయతీ రూములకు సంబంధించి రూ.5,65,700లు ఆదాయం వచ్చినట్టు పంచాయతీ కార్యదర్శి రమణ తెలిపారు.

'వివరాలు అందించండి'

ప్రజాశక్తి- చిత్తూరుడెస్క్: నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కంప్యూటరీకరణ జరుగుతున్నందున సంఘంలో సభ్యత్వం (ఓటుహక్కు) పొందుటకు రైతులు పొలం పాసుపుస్తకం, ఆధార్ కార్డు, పాన్ కార్డు, రెండు ఫోటోలు అందించాలని సీఈవో కె.తులసిపిళ్ళై గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పైన తెలిపిన వివరాలు అందించని పక్షంలో సభ్యత్వం రద్దు చేయబడుతుందని తెలియజేశారు. ప్రతి రైతు తగుపత్రాలు సమర్పించి సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలని కోరారు. వివరాలకు సంఘ సీఈవోను సంప్రదించాలన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి- కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో కార్వేటినగరంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు టీకేఎం పేట గ్రామానికి చెందిన మహేష్, మహేశ్వరీ దంపతులు తమ కుమార్తె కే.ప్రణవిక్రశ్రీ మొదటి పుట్టిన రోజును పురస్కరించుకుని అన్నదానం చేశారు. అలాగే వృద్ధాశ్రమంలో అవ్వతాతలతో కలసి కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. వారు మాట్లాడుతూ తమ కుమార్తె జన్మదిన వేడుకలను ప్రతిఏటా వృద్ధాశ్రమంలో జరుపుకుంటామని చెప్పారు. బాలకృష్ణయ్య, శంకర్, సురేష్, మహేంద్రబాబు, గోపాల్, లక్ష్మీపతిరెడ్డి, ధన్రాజ్, ఆకుల గోపి పలువురు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న మహేష్, మహేశ్వరి, కుటుంబ సభ్యులు

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గురువారం నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. వర్షాకాలంలో నీటి నిల్వ కారణంగా దోమకాటు ద్వారా వచ్చే మలేరియా, డెంగీ ,చికెన్ గున్యా ఎక్కువ అవుతున్న దృష్ట్యా అధికారులు ముందస్తు జాగ్రత్తలతో లార్వాలను నాశనం చేసి, రసాయనాలు స్ప్రే చేయటం, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అలాగే సీజనల్ వ్యాధులైన డయేరియా, అతిసార రాకుండా ఎప్పటికప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు వాటర్ టెస్టింగ్ సిహెచ్‌ఓల ద్వారా చేయించాలి. అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రతి గురువారం తప్పనిసరిగా సర్వే చేసిన పాపులేషన్‌కి టీకాలు వేసి యాప్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో డిఎంఅండ్‌హెచ్ఓ ప్రభావతిదేవి

సప్లమెంటరీ ఫలితాల్లో ..

పిఎస్ఎన్ వివేకానంద విజయకేతనం



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కరెస్పాండెంట్ పి. సత్యనారాయణ

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్: బుధవారం విడుదల చేసిన ఇంటర్ మొదటి సంవత్సరం సప్లమెంటరీ పరీక్ష ఫలితాలలో పిఎస్ఎన్ వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ప్రతిభ చాటి విజయకేతనం ఎగురవేశారని పిఎస్ఎన్ వివేకానంద జూనియర్ కళాశాల కరస్పాండెంట్ పి.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు అన్ని విభాగాల్లోనూ ఉత్తమ మార్కులు సాధించారని తెలిపారు. నికిత 466, ప్రశాంతి 466, సాహిత 466, దిలీప్ కుమార్ 465, ఐశ్వర్య 465, స్నేహ 465, వాసవి 465, ఉషశ్రీ 465, గణేష్ 465, అశ్విత 465, భావన 465 లిఖిత 465, మహాలక్ష్మి 465, కె. లికిత 464, లాస్య 464, హాసిని 464, కె. రిష్మాయిరెడ్డి 464, మాణ్యతారెడ్డిన్యత 464 , పద్మశ్రీ 464, వినీషా 464, రెడ్డి చరిత 464, వినీత 464, పల్లవి 463, మౌనిక 463, పల్లవి శ్రీరామన్ 463, పల్లవి శ్రీరామన్ 463, రణదీప్‌రెడ్డి 463, మహిత కీర్తి 463, లిఖిత 463 ఉత్తమ మార్కులు సాధించారని పేర్కొన్నారు.

466 మార్కులు సాధించిన వారిలో ముగ్గురు, 465 పదిమంది విద్యార్థులు, 464 మార్కులు 9 మంది విద్యార్థులు, 463 మార్కులు సాధించిన విద్యార్థులు 12 మంది , 462 మార్కులు 7మంది విద్యార్థులు, 461మార్కులు 9 మంది విద్యార్థులు, 460 మార్కులు 6 మంది విద్యార్థులు. 460 ఆపై 470 మార్కులు 56 మంది విద్యార్థులు సాధించారని ఇది తమ కళాశాల అధ్యాపకుల కషి, విద్యార్థుల పట్టుదలకు నిదర్శనమని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేందుకు కషిచేసిన అధ్యాపకులకు, విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజు శెట్టి అభినందనలు తెలియజేశారు. అలాగే ఉత్తం మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

శ్రీసిటీలో భవిష్యనిధి, భీమా సేవలపై అవగాహనా సదస్సు



ప్రజాశక్తి-వరదయ్యపాలెం: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ), ఉద్యోగుల రాష్ట్ర భీమా పథకం (ఈఎస్ఐసి) సంయుక్త ఆధ్వర్యంలో 'నిధి ఆప్కే నికత్ 2.0' పేరిట శ్రీసిటీ వాణిజ్య కేంద్రంలో గురువారం ఉద్యోగుల భవిష్యనిధి, భీమా సేవలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈపీఎఫ్ఓ తిరుపతి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రేమలాల్, ఈఎస్ఐసి తిరుపతి బ్రాంచి మేనేజర్ సి.నాగమణి సదస్సులో పాల్గొని పై అంశాలపై సవివరంగా పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి వివిధ కంపెనీలకు చెందిన సుమారు 100మంది మానవ వనరుల ప్రతినిధులు (హెచ్‌ఆర్‌లు) హాజరయ్యారు. ఈ సందర్భంగా, అధికారులు ఈపీఎఫ్ఓ పరంగా ప్రభుత్వం చేపడుతున్న వివిధ చర్యల సమగ్ర సమాచారాన్ని అందించారు. ఈ-నామినేషన్, యుఏఎన్ యాక్టివేషన్, కెవైసి అప్‌డేటింగ్, బ్యాంక్ ఆధార్ సీడింగ్, ఆన్‌లైన్ ఈసీఆర్ ఫైలింగ్, ఎంప్లాయీస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పథకం, ఉద్యోగుల పెన్షన్ పథకాలకు సంబంధించి ఉద్యోగులు లేవనెత్తిన అనేక ప్రశ్నలకు సమాధానాల రూపంలో వారి సందేహాలను నివృత్తి చేశారు. పై పథకాల పలు ప్రయోజనాలను వివరించారు.

క్రైం న్యూస్

ఆర్‌బికెలో ఎల్‌ఈడి టీవీ చోరీ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని గంగినాయనపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న రైతుభరోసా కేంద్రంలో గత ప్రభుత్వం రూ.90వేలు విలువచేసే ఎల్‌ఈడీ టీవిని ఏర్పాటు చేయడం జరిగింది. కాగా బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలిని దుండగులు ఆర్‌బికెలోని ఎల్‌ఈడీ టీవిని అపహరించారు. గురువారం ఉదయం విధులకు వచ్చిన ఆర్‌బికె సిబ్బంది చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంపిడిఓ రాజేష్, ఏవో గీత సమక్షంలో ఎస్సై కృష్ణయ్య, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆర్‌బికె పరిసరాలను పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు...



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్ పగడాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని తీర్థం కృష్ణయ్య శెట్టి జూనియర్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సును న్యాయవాదులు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగంపై ఇంటర్నేషనల్ డ్రగ్స్ డేను పురస్కరించుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దు అని, దీని వలన చిన్న మెదడు రక్తనాళాలు దెబ్బతినడంతో శరీర మొత్తం పాడైపోతుందన్నారు. విద్యార్థులు విద్యపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించి కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కన్నయ్య, సీనియర్ న్యాయవాదులు ఎల్.భాస్కర్, సయ్యద్ ఇస్మాయిల్, ఆరిఫ్ ఉల్లా ఖాన్ పాల్గొన్నారు.

'117 జీవోను రద్దు చేయాలి'

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాల నిర్వహణకు అవరోధంగా ఉన్న జీవో నెంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మోహన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణంలో ఎస్టీయూ మండల అధ్యక్షులు బి.బాబు రెడ్డి ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మోహన్ మాట్లాడుతూ విద్యావ్యవస్థకు గొడ్డలిపెట్టుగా ఉన్న 117 జీవోను ప్రభుత్వం వెంటనే రద్దుచేసి విద్యావ్యవస్థను బలోపేతం చేసి ప్రాథమిక పాఠశాల వ్యవస్థను, ఉన్నత పాఠశాలల్లో సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టియు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాబు రెడ్డి, గురుప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పుంగనూరు డివిజనల్ కన్వీనర్ నారాయణస్వామి, ఆర్థిక కార్యదర్శి శివప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ అంజాద్ అలీఖాన్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాగరాజా, జిల్లా కౌన్సిలర్లు లక్ష్మీపతి బాలాజీ, మహేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు హరిప్రసాద్, చంద్రశేఖర్, రమేష్ పాల్గొన్నారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు హ్యూమన్ రైట్స్ కార్యాలయంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ సభ్యులచే సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నేషనల్ చీఫ్ సెక్రటరీ బుల్లెట్ రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ ధనుంజయ నాయుడు మాట్లాడుతూ నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్పించిన హక్కులను ప్రజలు ఉపయోగించుకోవాలని, జాతి, వర్ణ, లింగ, కులమత రాజకీయ వివక్ష నుంచి ప్రజలు రక్షణ పొంది హక్కులను వినియోగించుకోవాలన్నారు. ఇటీవల చిత్తూరు సమీపం గుడిపాల మండలంలోని చిత్తపారా గ్రామంలో నందిని అనే యువతని ఆస్తి తగాధ కారణంగా అతి దారుణంగా కొట్టి చిత్రహింసలు పెట్టడం జరిగిందని ఈ విషయం తెలిసిన వెంటనే నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ అండగా నిలిచి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయించి జైలుకు పంపడం జరిగిందని తెలియజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న బుల్లెట్ రవి

సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు అందజేత

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రెండు ప్రభుత్వ కార్యాలయాల్లో టీడీపీ, జనసేన నేతలు కలిసి సీఎం, డిప్యూటీ సీఎం ఫోటోలను అందజేశారు. మండల కేంద్రంలోని తహశీల్దార్, గృహనిర్మాణ శాఖ కార్యాలయాలకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫోటోలను చిత్తూరు పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి కేతినేని లోకేష్ నాయుడు, మండల టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు శేఖర్, నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ ప్రకాష్ , జనసేన మండల అధ్యక్షులు డిఎస్.సురేష్ బాబు కలిసి తహసీల్దార్ రవి, హౌసింగ్ ఏఈ



దాము, వర్క్ ఇన్స్పెక్టర్ గీతలకు అందజేశారు. టిడిపి, జనసేన నాయకులు రషీద్, జీసన్, సతీష్, తులసి, జగదీష్ పాల్గొన్నారు.

అలాగే బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లి పంచాయతీలోని సచివాలయం, పిహెచ్‌సిల్లో సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలు ఉంచాలని మాజీ సింగల్ విండ్ అధ్యక్షులు హేమచంద్ర నాయుడు తెలిపారు. ఉపసర్పంచ్ లోకనాథం నాయుడు ఆధ్వర్యంలో ఫొటోలను అందజేశారు.

కార్వేటినగరం : మండల పరిధిలోని ఆర్కేవిబి పేట సచివాలయానికి గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలను సచివాలయానికి కార్యదర్శి లోకేష్‌కు టిడిపి నాయకులు హేమంత్ రెడ్డి, మండల యువత ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఢిల్లీ బాబు రెడ్డి, నాగభూషణ్ రెడ్డి, సతీష్, దాము, రాజశేఖర, జనసైనికులు రాఘవ, వినోద్, సతీష్ అందించారు.

ఎస్ఆర్ పురం: గురువారం మండలంలోని కటికపల్లి గ్రామ సచివాలయ కార్యాలయంకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలను జనసేన మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సాయికుమార్ అందజేశారు. టిడిపి నాయకులు కేఎం.రవి వేమన్న నాయుడు, శేఖర్ త్యాగరాజులు, చిరంజీవి, పవన్, భరత్, నాగరాజు షణ్ముగం, జగదీష్ పాల్గొన్నారు.